క్లుప్తంగా

ఘనంగా జగన్నాథుని నేత్రోత్సవం



పూజలు చేస్తున్న అర్చకులు

శ్రీకాకుళం కల్చరల్: పట్టణంలోని గుజరాతిపేటలో జగన్నాథస్వామి దేవాలయంలో శనివారం నేత్రోత్సవం ఘనంగా జరిగింది. అర్చకులు పెంట వంశీయుల ఆధ్వర్యంలో ఈ నెల 7 నుంచి జగన్నాథుని రథయాత్ర ఉత్సవాలు జరగనున్న నేపథ్యంలో స్వామివారి కళా వాహనం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవదాయశాఖ ఆధ్వర్యంలో రథయాత్ర నిర్వహణకు ఏర్పాట్లు చేసినట్లు ఈఓ శ్యామలరావు తెలిపారు.

మధ్యాహ్న భోజన మెనూ పాటించాలి



వంటకాలను పరిశీలిస్తున్న సర్పంచ్ నాగమణి

ఎచ్చెర్ల: పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం మెనూ తప్పక పాటించాలని మురపాక సర్పంచ్ పెయ్యిల నాగమణి సూచించారు. శనివారం మురపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. మధ్యాహ్న భోజనం, శానిటేషన్, మంచినీటి సదుపాయాలపై ఆరా తీశారు. వంట సిబ్బందికి పలు సూచనలిచ్చారు. కార్యక్రమంలో హెచ్ఎం ప్రభాకరరావు, ఉపాధ్యాయులు ఎస్.రమణమ్మ, వార్డు సభ్యులు వండాన సిమ్మినాయుడు, నాయకులు రాకోటి గణేష్, మారుబారికి శ్రీహరి పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ దొంగలు అరెస్టు

ఎచ్చెర్ల క్యాంపస్: చిలకపాలెంలో జాతీయ రహదారిపై పార్కింగ్ చేసి ఉన్న లారీ నుంచి రెండు సెల్‌ఫోన్లు, రూ.100 నగదు చోరీ చేస్తూ ఇద్దరు వ్యక్తులు శనివారం పట్టుబడ్డారు. యాతపేట, విశాఖపట్నం ప్రాంతాలకు చెందిన పైడిరాజు, గౌతం చిన్నచిన్న చోరీలు చేస్తుంటారు. ఈ క్రమంలో లారీ క్యాబిన్‌లో చోరీకి పాల్పడుతూ డ్రైవర్, స్థానికులకు పట్టుబడ్డారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

జాబ్‌మేళాలో 116 మంది ఎంపిక



జాబ్‌మేళాలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎన్ఈఆర్

రణస్థలం: పైడిభీమవరం పారిశ్రామికవాడలో ఫార్మా రంగానికి ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉన్నందున దానికి అనుకూలమైన కోర్సులు చదువుకోవాలని ఎన్ఈఆర్ స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ వ్యవస్థాపక చైర్మన్, ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు సూచించారు. శనివారం ఎన్ఈఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సెలెన్స్ ప్రాంగణంలో జాబ్ మేళా నిర్వహించారు. ఏపీటోరియా ఫార్మాకు 51 మంది కెమిస్ట్రీలు, సీఎంఎఫ్ ల్యాబ్ పరిశ్రమకు 65మంది ఎస్ఎంటీలు ఎంపికయ్యారు. కార్యక్రమంలో సీఎంఎఫ్ ల్యాబరేటరీ మేనేజింగ్ డైరెక్టర్ జి.జగదీశ్వరరావు, డైరెక్టర్ ఐ.శ్రీనివాసరావు, రిక్రూట్‌మెంట్ హెడ్ విజయకృష్ణ, స్కూల్ డైరెక్టర్ ఎన్.తేజ పాల్గొన్నారు.

ఆత్మీయ సత్కారం



ఎమ్మెల్యే శంకర్ దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: ఆర్ట్ ఆఫ్ లివింగ్ శ్రీకాకుళం శాఖ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే గొండు శంకర్ దంపతులను శనివారం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సీనియర్ టీచర్ శంకరనారాయణ, ఏఓఎల్ డాక్టర్ కె.అమ్మన్నాయుడు, సుధారాణి, గీతాశ్రీకాంత్, రేణుకా సురేందర్, గోవింద్, సందీప్, బి.వి.రవిశంకర్, పి.ఎం.జె.బాబు, బోయిన గోవిందరాజులు, మీడియా కోఆర్డినేటర్ కెఎస్ఎన్ మూర్తి, శ్రీనివాస్, రామ్మోహన్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఎస్పీ, జేసీలను కలిసిన వర్సిటీ అధికారులు

ఎచ్చెర్ల క్యాంపస్: జిల్లా ఎస్పీ జీఆర్ రాధిక, జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్‌లను డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ పి.సుజాత, ఓఎస్డీ యు.కావ్యజ్యోత్స్న, చీఫ్ వార్డెన్ ఎస్.లోకేశ్వరిలతో కూడిన అధికారుల బృందం శనివారం కలిసింది. విశ్వవిద్యాలయంలో ర్యాగింగ్ నియంత్రణపై తీసుకుంటున్న చర్యలు వివరించి అవగాహన సదస్సుకు ఎస్పీని ఆహ్వానించారు. వర్సిటీలో ఇటీవల చోటుచేసుకున్న పరిణామాలు, మీడియాలో వచ్చిన అంశాలపై జేసీకి వివరణ ఇచ్చారు.

వారాహి నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం



బలగలోని కాలభైరవ ఆలయంలో సామూహిక కుంకుమ పూజలు



గుజరాతిపేటలో వారాహి అమ్మవారికి పూజలు



మొండేటివీధిలో వారాహి దేవిగా లలితాదేవి

- అమ్మవారికి ప్రత్యేక పూజలు
- తొమ్మిది రోజుల పాటు నిర్వహణ

శ్రీకాకుళం కల్చరల్:

నగరంలోని గుజరాతిపేటలో రాజరాజేశ్వరీ మహా త్రిపురసుందరి దేవీపీఠంలో వారాహి అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు. తొమ్మిది రోజుల పాటు పూజలు జరుగుతాయని పీఠం నిర్వాహకులు పెంట రామచంద్రశేఖరశర్మ తెలిపారు.

-మొండేటి వీధిలోని లలితాదేవి సహిత శివకామేశ్వరస్వామి దేవాలయంలో వారాహి గుప్త నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అర్చకులు అమ్మవారిని వారాహీదేవిగా ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. కార్యక్రమంలో షిరిడీసాయి సేవా సంఘం సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

- బలగ నాగావళి తీరంలో ఉన్న బాలా త్రిపుర కాలభైరవ పీఠం దేవాలయంలో వారాహి అమ్మవారి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పీఠం నిర్వాహకులు గణేష్ గురూజీ అమ్మవారికి ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు చేశారు. తొమ్మిది రోజుల పాటు గుప్త నవరాత్రులలో భాగంగా కుంకుమపూజలు, హోమాలు, యంత్ర పూజలు, ద్వాదశ హారతులు జరుగుతాయని, భక్తులు పాల్గొని పూజలు చేయించుకోవచ్చని పీఠం నిర్వాహకులు తెలిపారు.

దుప్పలవలసలో కొనసాగుతున్న వైద్య శిబిరం

ఎచ్చెర్ల క్యాంపస్: దుప్పలవలసలోని డాక్టర్ అంబేడ్కర్ బాలుర గురుకుల పాఠశాల/జూనియర్ కళాశాలలో వైద్య శిబిరం కొనసాగుతోంది. విద్యార్థులందరికీ ఆరోగ్య సమస్యలు దాదాపుగా అదుపులోకి వచ్చాయి. పొన్నాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఎన్.శేషగిరి, వైద్యురాలు పి.సౌమ్య, ఈవో జగన్నాథరావు ఆధ్వర్యంలో బృందం వైద్య సేవలను పర్యవేక్షిస్తోంది. విద్యార్థులు పూర్తిగా కోలుకునే వరకు మరో మూడు రోజుల పాటు వైద్య శిబిరం నిర్వహించాలని భావిస్తున్నారు. మరోవైపు ముగ్గురు విద్యార్థులకు కడుపు నొప్పికి సంబంధించి శనివారం వైద్యసేవలు అందించారు. ఓ విద్యార్థిని రిమ్స్‌కు రిఫర్ చేసి స్కాన్ చేయించారు. గురుకులంలో బోరు బావుల్లో నీటి నమూనాలను శుక్రవారం సేకరించిన శ్రీకాకుళం నగర పాలక సంస్థ తాగునీటి అధికారులు ఫలితాలు అందజేశారు. నీటి వల్ల సమస్య లేదని తేల్చారు. మరోవైపు విద్యార్థులు ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు ప్రిన్సిపాల్ బోర బుచ్చిరాజు తెలిపారు. మెస్‌లో పూర్తిస్థాయి పారిశుద్ధ్యంపై దృష్టిపెట్టామన్నారు.

కళాకారుల సేవ అభినందనీయం



పింఛన్లు పంపిణీ చేస్తున్న అతిథులు



దొందూ దొందే నాటికలో ఓ సన్నివేశం

శ్రీకాకుళమ కల్చరల్: రంగస్థల కళాకారులు చేస్తున్న కళా సేవ అభినందనీయమని జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కిలారి ఈశ్వరరావు అన్నారు. నగరంలోని బాపూజీ కళామందిర్‌లో రంగస్థల కళాకారుల 297వ నెలవారీ సాంస్కృతిక కార్యక్రమం శనివారం జరిగింది. ఈ సందర్భంగా లైసెన్స్‌డ్ స్ట్రక్చరల్ ఇంజినీర్ ముంగి శ్రీనివాసరావు మాట్లాడుతూ పేద కళాకారులను ఆదుకోవడం గొప్పవిషయమన్నారు.

ఈ సందర్భంగా కళాకారుల సమాఖ్యకు తన వంతుగా రూ.3వేలు విరాళం, ప్రతి నెలా పేద కళాకారుల కోసం రూ.500 అందజేస్తున్నట్లు ప్రకటించారు. చిట్టి వెంకటరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పేద కళాకారులకు పింఛన్లు అందజేశారు. నాటక ప్రదర్శన చేస్తున్న ఎస్.డేవిడ్ రాజును సత్కరించారు. అనంతరం గోపాలపట్నంకు చెందిన భద్రం ఫౌండేషన్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో 'దొందూ.. దొందే..' హాస్యనాటికను ప్రదర్శించారు. కార్యక్రమంలో పన్నాల నర్సింహమూర్తి, బి.రామచంద్రదేవ్, లోకనాథం రామలింగేశ్వరస్వామి, పొట్నూరు వెంకట్రావ్, కలగ గణేష్‌యాదవ్, మెట్ట పోలినాయుడు, అగతమూడి సింహాచలం, కంచరాన అప్పారావు, రమణారావు, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్ ఆదర్శప్రాయుడు



ఎచ్చెర్ల క్యాంపస్: వర్సిటీ సెమినార్ హాలులో మాట్లాడుతున్న వీసీ రజిని



శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దళిత సంఘాల నాయకులు

ఎచ్చెర్ల క్యాంపస్: నేటి సమాజానికి బాబూ జగ్జీవన్‌రామ్ ఆదర్శంగా నిలుస్తారని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ కె.ఆర్.రజిని అన్నారు. వర్సిటీ సెమినార్ హాలులో శనివారం జగ్జీవన్‌రామ్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్ని వివక్షలు ఎదురైనా ప్రజా సంక్షేమం, చైతన్యం కోసం కృషి చేసిన ఘనత జగ్జీవన్‌రామ్‌కే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో రెక్టార్ బి.అడ్డయ్య, రిజిస్ట్రార్ పి.సుజాత, ఓఎస్డీ యు.కావ్యజ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): దేశ మాజీ ఉపప్రధాని బాబు జగజ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని ఆయన దళిత సంఘాల జేఏసీ నాయకుడు, అంబేడ్కర్ ఇండియా మిషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తైక్వాండో శ్రీను, కరెన్సీనోటిపై అంబేడ్కర్ ఫోటో సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు కంఠ వేణు, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు బోసు మన్మధరావు, ఆల్ ఇండియా దళిత రైట్స్ ఫోరం జిల్లా ప్రధాన కార్యదర్శి యజ్జల గురుమూర్తి, మాలమహానాడు జిల్లా నాయకులు సాంబారిక సూరిబాబు, అంబేద్కర్ ఇండియా మిషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పురుషోత్తం రాంబాబు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

జూట్‌బ్యాగుల తయారీపై శిక్షణ

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని బ్యాంకర్స్ కాలనీలో సత్యసాయి సేవా సమితి సాయి బృందావనం ఆధ్వర్యంలో జూట్ బ్యాగుల తయారీ, స్క్రీన్ ప్రింటింగ్‌పై మహిళలకు 30 రోజుల శిక్షణ ఇస్తున్నట్లు మందిరం కన్వీనర్ ప్రసాదరావు ఒక ప్రకటనలో తెలిపారు. 19 నుంచి 35 ఏళ్లలోపు మహిళలకు శాశ్వత స్వయం ఉపాధి కల్పించేందుకు శిక్షణ ఇస్తామని, ఈ నెల 20లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మందిరంలో ఉన్న స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రంలో శిక్షణ ఉంటుందని, వివరాలకు 9948004156, 9440398049 నంబర్లను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

ఎంపీ కలిశెట్టికి ఘన స్వాగతం



ఎంపీకి స్వాగతం పలుకుతున్న కూటమి నాయకులు

రణస్థలం: విజయనగరం పార్లమెంట్ సభ్యుడిగా ఢిల్లీలోని పార్లమెంట్‌లో ప్రమాణ స్వీకారం చేసి మొదటిసారిగా రణస్థలంలోని స్వగృహానికి విచ్చేసిన కలిశెట్టి అప్పలనాయుడుకు ఎన్డీఏ కూటమి సభ్యులు గజమాలలతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జె.ఆర్.పురంలో ఎంపీ మాట్లాడుతూ విజయనగరంలోని ఎచ్చెర్ల నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించి మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని ప్రకటించారు.

వ్యాధులను అరికట్టాలి

శ్రీకాకుళం అర్బన్: వ్యాధులు ప్రబలకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఐసీడీఎస్ శ్రీకాకుళం అర్బన్ ప్రాజెక్ట్ అధికారిణి శోభారాణి అన్నారు. గూనపాలెం సెక్టారు అంగన్వాడీ కేంద్రాల పరిధిలో గూనపాలెం, ఎల్‌బీఎస్ పార్కులతో పాటు వార్డులో ఇంటింటికి వెళ్లి వర్షాకాలంలో ప్రబలే వ్యాధులపై అంగన్‌వాడీలు ప్రజలకు వివరించారు. కృష్ణాపార్కు సెక్టారు పరిధిలో సూపర్‌వైజర్ పి.సీతామహలక్ష్మి, అంగన్‌వాడీ సిబ్బంది అవగాహన కల్పించారు.

వేంకటేశ్వరునికి విశేష పూజలు

శ్రీకాకుళం కల్చరల్:

నగరంలోని ఫాజుల్‌భాగ్‌పేటలో నారాయణ తిరుమల కొండపై వెలసిన వేంకటేశ్వర స్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు గురుగుబెల్లి శ్రీనివాసులు ఆధ్వర్యంలో సుప్రభాతసేవ, అష్టోత్తర శతనామాలు, భక్తుల గోత్రనామాలతో పూజలు జరిగాయి. వెంకట రామానుజ సేవాళం ఆధ్వర్యంలో సామూహిక విష్ణు సహస్ర నామ పారాయణ నిర్వహించారు. చిన్నబజారులోని దూదివారి వేంకటేశ్వర స్వామి ఆలయంలోఅర్చకులు శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో, మొండేటివీధిలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో అర్చకులు పట్నాల రామకృష్ణ శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. కలెక్టర్ బంగ్లా వద్ద కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయం కమిటీ సభ్యులు నగరవీధుల్లో హరినామ సంకీర్తనలు ఆలపించారు. అర్చకులు వంశీకృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో సుప్రభాతసేవ, అష్టోత్తరశత నామాలు, భక్తుల గోత్రనామాలతో పూజలు జరిగాయి.

సమస్యలు పరిష్కరించాలని వినతి



ఎమ్మెల్యే ఈశ్వరరావుకు వినతిపత్రం అందజేస్తున్న మహిళా పోలీసులు

రణస్థలం: సచివాలయ మహిళా పోలీసులకు సరైన విధివిధానాలు ఏర్పాటు చేసి సమ న్యాయం దిశగా ప్రణాళిక రూపొందించాలని ఏపీ మహిళా పోలీస్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ స్టేట్ జాయింట్ సెక్రటరీ, కోస్తా సచివాలయం మహిళా పోలీస్ అమ్మాజీ కోరారు. ఈ మేరకు బంటుపల్లిలో ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావును రణస్థలం, లావేరు, ఎచ్చెర్ల మండలాల సచివాలయ మహిళా పోలీసులు మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రభుత్వం దృష్టికి తమ సమస్యలను తీసుకెళ్లాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. అనేక శాఖల పనులు చేస్తున్నా తమకు తగిన గుర్తింపు లేదన్నారు. మహిళా పోలీసుల కోర్టు కేసు విషయంలో పురోగతి వచ్చేలా చూసి తమకి లైన్ డిపార్ట్‌మెంట్ కేటాయించాలని కోరారు.

పెంపుడు జంతువులపై శ్రద్ధ అవసరం



ర్యాబిస్‌పై అవగాహన కల్పిస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు



కారులో దర్జాగా శునకం



పెంపుడు కుక్కలను రిక్షాలో తీసుకొస్తున్న మహిళ



రణస్థలం: పెంపుడు కుక్కలకు రేబిస్ టీకాలు వేస్తున్న వైద్యులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): జంతువుల ద్వారా సంక్రమించే వ్యాధులపై అవగాహన పెంపొందించుకుని పెంపుడు జంతువుల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ సూచించారు. శ్రీకాకుళం నగరంలో పశుసంవర్ధకశాఖ కార్యాలయంలో శనివారం వరల్డ్ జునోసిస్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ వి.జయరాజు మాట్లాడుతూ రేబిస్ టీకాను జూలై 6న కనిపెట్టడం వల్ల ఏటా ప్రపంచ జునోసిస్ డే జరుపుకొంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ డీడీలు కె.రాజగోపాల్, టి.మనోజ్‌కుమార్, అసిస్టెంట్ డైరెక్టర్లు వై.వెంకట కృష్ణారావు, కిషోర్ తదితర అధికారులు, వైద్యులు, జంతు ప్రేమికులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్: ర్యాబిస్ వ్యాధికి చికిత్సలేదని, నివారణ ఒక్కటే మార్గమని లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ అధ్యక్షుడు డాక్టర్ బొడ్డేపల్లి సురేష్ అన్నారు. నగరంలోని 80 అడుగుల రోడ్డులో శనివారం లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ ఆధ్వర్యంలో ర్యాబిస్ వ్యాధిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శ్రీకాకుళం వెటర్నిటీ అధికారి డాక్టర్ బి.యోగేశ్వరరావు, క్లబ్ మెంటార్ నటుకుల మోహన్, జోన్ చైర్మన్ పొన్నాడ రవికుమార్, పూర్వపు సెక్రటరీ టిక్కం గోపి క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

రణస్థలం: పెంపుడు కుక్కలకు విధిగా రేబిస్ టీకాలు వేయించుకోవాలని రణస్థలం పశుసంవర్ధకశాఖ ఏడీ బంటుపల్లి దుర్గారావు సూచించారు. ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా స్థానిక పశువుల ఆసుపత్రిలో పెంపుడు కుక్కలకు ఉచితంగా రేబిస్ వ్యాక్సిన్లు వేశారు.

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల ప్రభుత్వ పశువైద్యశాలలో శనివారం ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా పెంపుడు కుక్కలకు రేబిస్ టీకాలు వేశారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి వి.రమణ, సిబ్బంది పాల్గొన్నారు.

పాత్రునివలస-పాతబస్టాండ్ బస్సు సర్వీసు ప్రారంభం



జెండా ఊపి బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్

శ్రీకాకుళం అర్బన్: ఆర్టీసీ బస్సును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. శ్రీకాకుళం రూరల్ మండలంలోని పాత్రునివలస నుంచి పాతబస్టాండ్‌కు ఏర్పాటు చేసిన ఆర్టీసీ బస్సు సర్వీసును శనివారం ఎమ్మెల్యే జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ బస్సు ఏర్పాటు ద్వారా పాత్రునివలస సమీపంలోని ఏపీ టిడ్కో కాలనీవాసుల ప్రయాణ కష్టాలకు తెరపడినట్లు అవుతుందన్నారు. శ్రీకాకుళం ఒకటో డిపో మేనేజర్ మల్లికార్జునరాజు మాట్లాడుతూ ప్రతి రోజు ఉదయం 8.30గంటలకు టిడ్కో కాలనీ నుంచి శ్రీకాకుళం పాతబస్టాండ్‌కు, తిరిగి సాయంత్రం 6.30 గంటలకు పాతబస్టాండ్ నుంచి పాత్రునివలస టిడ్కో కాలనీకి సర్వీస్ నడుస్తుందని వివరించారు.

ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో వరి తర్వాత ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలని, ఆ దిశగా రైతులను సన్నద్ధం చేయాలని కలెక్టర్ కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖ, పట్టు పరిశ్రమ, తదితర అనుబంధ శాఖలతో కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆయన సమావేశం నిర్వహించారు. జిల్లాలో వ్యవసాయం, ఉద్యానవనం ఎంతెంత విస్తీర్ణంలో ఉన్నాయో ఆరా తీశారు. పామాయిల్ వెయ్యి హెక్టార్లలో ఉండగా, జీడి, కొబ్బరి వెయ్యి హెక్టార్లలో ఉన్నట్లు ఏడీ ప్రసాదరావు చెప్పారు. వ్యవసాయ శాఖకు సంబంధించి ఖరీఫ్‌లో ప్రత్యామ్నాయ పంటలు ఉండవని, రబీలో ప్రత్యామ్నాయ రెండో పంటగా మొక్కజొన్న సుమారు 25 వేల హెక్టార్లకు పెంచుతామని జేడీ చెప్పారు. పామాయిల్‌ను ఉపాధి హామీకి అనుసంధానం చేయాలని అలా అయితే మూడేళ్ల వరకు మెయింటెనెన్స్ ఉంటుందని కలెక్టర్ వివరించారు. సమావేశంలో వ్యవసాయ శాఖ జేడీ శ్రీధర్, డ్వామా పీడీ చిట్టిరాజు, ఎపిఎంఐపి డీడీ శ్రీనివాసరావు, జిల్లా ఉద్యానవన శాఖ ఏడీ ప్రసాదరావు, జిల్లా పట్టు పరిశ్రమ శాఖ ఏడీ రాజేంద్ర ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన రెవెన్యూ విశ్రాంత ఉద్యోగులు



కలెక్టర్‌తో మాట్లాడుతున్న రెవెన్యూ విశ్రాంత ఉద్యోగులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన స్వప్నిల్ దినకర్‌ను జిల్లా విశ్రాంత రెవెన్యూ ఉద్యోగ సంఘం నాయకులు శనివారం మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో రిటైర్డ్ జాయింట్ కలెక్టర్ పి.రజనీకాంతరావు, డి.చంద్రశేఖర్, జల్లేపల్లి రామారావు, కాశీప్రసాద్, ఎస్.మోహనరావు, ఆనందకుమార్, హెన్రీ, పి.రాంబాబు, జేమ్స్ ప్రభాకర్, లక్ష్మణమూర్తి, డి.పి.దేవ్ ఉన్నారు.

కార్మిక సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ ప్రతినిధులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): కార్మికుల న్యాయబద్ధమైన సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమాలు ఉధృతం చేస్తామని చేస్తామని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్ అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు హెచ్చరించారు. సీఐటీయూ జిల్లా కార్యాలయంలో శనివారం జిల్లా విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జూలై 10న అఖిల భారత కోర్కెల దినం సందర్భంగా నిరసన జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా నాయకులు కె.సూరయ్య, ఎన్.వి.రమణ, ఎన్.గణపతి, హెచ్.ఈశ్వరరావు, జి.అమరావతి, బి.ఉత్తర, ఆర్.ప్రకాష్, పి.లతాదేవి, ఎస్.బలరాం, కె.చంద్రశేఖర్, రాజు, ఎస్.సూరిబాబు జి.కిరణ్ పాల్గొన్నారు.